

జానకి కిటికీలోంచి బయటికి చూస్తూ కూర్చుంది బయట సన్నగా చినుకులు పడుతున్నాయి. నేల పూర్తిగా తడవలేదు. చల్లనిగాలి వీస్తోంది.

వీధిలో సందడిగా ఉంది. వర్షం పెరుగుతుందనే భయంతో కొందరు తొందరగా నడుస్తున్నారు. కొంచెం వర్షం ఎక్కువ కాగానే జనం షాపుల లోను, హోటళ్ళలోను చేరుతున్నారు.

జానకి వీళ్ళ నెవర్నీ చూడటంలేదు. ఊరికే బయటికి చూస్తోంది.

రాజారావు కూడా పక్క కిటికీ లోంచి చూస్తున్నాడు స్నేహితులకోసం. వాళ్ళు వస్తున్నట్లులేదు. విసుగ్గా చేతి వాచీ చూసుకున్నాడు తొమ్మిదయింది.

'ఇదుగో, ఇలారా. ఇక్కడంతా శుభ్రం చెయ్యి' అన్నాడు.

జానకి మాట్లాడకుండా చీపురు తీసుకువచ్చి ఊడ్చింది. చీపురు తలుపు చాటున పెట్టి ఇంకా ఏం చెబుతాడో అని ఎదురు చూస్తూ నిలుచుంది.

'సిగరెట్లు తెప్పించావా ?' అని అడిగాడతను. ఆమె తలవూపింది. 'సరే టిఫిను ప్రయత్నం కానియ్యి' అన్నాడతను. ఆమె లోపలికి వెళ్ళిపోయింది.

బర్కిలీ సిగరెట్టు వెలిగించాడతను. సిగరెట్టు నోట్లోనే వుంచుకుని చొక్కా-స్టాండు దగ్గరికి వెళ్ళి చేతికందిన చిల్లర తీసుకుని తివాసీమీద ఒక పక్కన పోశాడు. చొక్కాలోనోట్లు ఉన్నాయి గాని వాటిని తియ్యలేదు. అది వాళ్ళ సెంటిమెంటు. ఎక్కువ డబ్బు ముందు పెట్టుకుని ఎవరూ ఆడరు.

నాలుగు సిగరెట్లు కాల్చేసరికి వచ్చాడు రాజు. 'వీళ్ళు ఇంకా రాలేదా?'

'రా, కూర్చో. ఇంకో పావుగంటలో వస్తానన్నాడు సీతాపతి. అవధాని వచ్చే టప్పటికి ఆలస్యం అవుతుంది. ముగ్గురం వెయ్యచ్చు ఈ లోగా' అన్నాడు రాజారావు.

మాటలోనే సీతాపతి వచ్చాడు. 'అవధాని రాలేదా' అంటూ. ముగ్గురూ ఆట మొదలుపెట్టి ఒక అరగంట ఆడే సరికి అవధాని వచ్చాడు. 'రారా నాయనా. నీ కోసమే చూస్తున్నాం.

కాశీనాథుని రామచంద్రరావు

నువ్వులేకపోతే ఆటలో రంజు లేదు.' అన్నాడు సీతాపతి.

సిగరెట్ పేకెట్ అవధాని వైపు తోశాడు రాజారావు.

'ఇవాళ మంచి హుషారు మీద ఉన్నాను. షోలన్నీ నావీ' అన్నాడు అవధాని.

'షోలేం ఖర్మ. నువ్వు కార్డుషోలే చెయ్యగలవు' అన్నాడు సీతాపతి.

'ఒరేయి నువ్వు చచ్చు విట్లు మానెయ్యి. నీవిట్లు నీకు తప్ప ఇంకెవ్వరికీ నవ్వురావు' అన్నాడు రాజు.

ఆట ముమ్మరంగా సాగిపోతోంది, నిజంగా అవధాని మంచి 'రైజు'లో ఉన్నాడు. ముట్టుకున్న ప్రతిముక్కా 'ఎక్కుతోంది.' మొదటి ఆట డీల్. రెండుకౌంట్లు దొరికాయి. రెండు బతుకులకి ఆడినా, ఒక్క బతుక్కి ఆడినా నాలుగయిదు రౌండ్లు తిరిగేసరికల్లా రకీమని షో కొడుతున్నాడు. పేకలోకి వెడితే జోకరో, మిడిల్‌కార్డో తగుల్తున్నాయి.

సీతాపతి రెండాటలు కొట్టాడు. రాజారావు ఒకటి. రాజు అసలు ఒకటి కూడా కొట్టలేదు. రాజుది స్వతహాగా విన్నింగ్ హేండు. ఇవాళ కలిసి రావటంలేదు. ముక్కలు కలవటం లేదు. కలిసినా ముక్కలు ఎక్కటం లేదు. ఒక్క బతుక్కికూడా ఆడే ధైర్యం లేదు. సగం ఆటలు డ్రాప్ చేశాడు. నాలుగు మిడిల్ డ్రాపులు చేశాడు. ఎనిమిది రూపాయిలు పోయింది.

రాజు పంచాడు. పదమూడు ముక్కలు పంచి ఇస్పేటు మూడు తిరగేసి ముక్కకోశాడు. ఖర్మ. ఓపెన్. "ఓపెన్ తిప్పాను' అన్నాడు. ఆ ఆట సీతాపతి 'కొట్టాడు'.

రాజు 'కట్ ఫర్ షఫ్లింగ్' వేయించాడు, అవధాని సీటు రాజుకి వచ్చింది. రాజారావు ఉన్నచోటే ఉన్నాడు. సీతాపతి రాజు సీట్లోకి వచ్చాడు. సీట్లతో పాటు అదృష్టాలూ మారిపోయాయి.

ఆట జోరుగా సాగుతోంది. డబ్బు చేతులు మారుతోంది. నలుగురూ కలిసి ఏకబిగిని కాలుస్తోంటే సిగరెట్లు అయిపోయాయి. 'జానకీ. ఇవేనా సిగరెట్లు? ఇంకా ఉన్నాయా?' అన్నాడు.

'తెప్పించాలా' అంది జానకి తలుపు దగ్గరకి వచ్చి. 'నాలుగు పేకెట్లు తెప్పించు' అన్నాడు.

జానకి కుర్రాడిని పంపి లోపలికి వెళ్ళిపోయింది. వెళ్ళి మంచం మీద కూర్చుంది. కాసేపు కూర్చుని వెనక్కివాలింది. ఏమీ చెయ్యాలనిపించడం లేదు. ఏమీ చెయ్యకపోతే తోచడంలేదు. అదోరకం పరిస్థితి. సుఖంగాలేదని తెలుస్తుంది. కాని ఏ విషయంలో సుఖం లేదో, సుఖం ఎలా తెచ్చుకోవాలో తెలియదు.

కాసేపు గదిగోడలని, కాసేపు పైకప్పునీ, మంచాన్నీ గదిలో వస్తువుల్నీ చూస్తూ కూర్చుంది. తర్వాత ఏమీ తోచక దుప్పటి డిజైను పరీక్షచేస్తూ కూర్చుంది. ఆమె చూపులు శూన్యంగా

విర్లిప్తంగా ఉన్నాయి. ఆ చూపుల చివర ఏమీ ఉన్నట్లు లేదు.

'అంట్లు వెయ్యండమ్మగారూ' అంటూ పని మనిషి కేక వినిపించింది. 'ఇదొకర్తి' అంటూ దానిమీద విసుక్కుంది జానకి అకారణంగా. లేచి వెళ్ళడం తప్పనిసరి కాబట్టి లేచింది. 'అంట్లా? చెంబులు తోమావా అప్పుడే అంట్లకి? ఇదిగో చూడు. దీనికింకా మచ్చలు పోలేదే. మళ్ళీతోము. కాస్త పొట్టు తీసుకో. అయినా సుకుమారంగా తోమితే ఏం వదుల్తాయి?' అంది కోపంగా. పనిమనిషి మాట్లాడకుండా వెళ్ళిపోయింది.

ఇంతలో బుజ్జిగాడు వచ్చాడు. 'అమ్మా. డ్రాయింగుపుస్తకంకొనుక్కోమన్నారు స్కూల్లో. పావలా కావాలి' అంటూ. నాన్నగారిని అడుగు అంటూ పంపించేసింది జానకి.

నిమిషంలోనే గట్టిగా మాటలు వినిపించాయి. "వీడిని ఇక్కడి కెందుకు పంపించావు? డబ్బులు నువ్వివ్వలేవా?" అని అరుస్తున్నారాయన. జానకికి ఒళ్ళు చచ్చిపోయి నట్లనిపించింది. ఆ తిట్టే దేదో లోపలికివచ్చి తిట్టరాదా అనుకుంది. తిట్టడానికి లోపలికి రావాల్సిన అవసరం ఉందని అతను అనుకోడు. అసలు అక్కడనుంచి కదలడానికి మనసొప్పదు. ఆట రంజుపోతుంది.

"నీది కౌంటేనా? ఇచ్చుకో రూపాయి. నీది ఘుప్పైఆరా? ఒరేయ్. నువ్వు ముక్క దాచెయ్యకు. నాకు ఎలాగూ తెలుస్తుంది. నీ దెంత. ఏమీ లేదా? రెండా? నువ్వు రూపాయి చిల్లరియ్యి" అంటూ హడావిడి చేస్తున్నాడు రాజారావు.

"ఆట నెగ్గిఉంటారు" అనుకుంది జానకి. సంవత్సరాల తరబడి వినగా వినగా ఆమెకి కొన్ని మాటలు పట్టుబడ్డాయి. వద్దన్నా మనసులోకి దూరి కూర్చున్నాయి. అవి వినటం కన్నా ఆమెకి మరేపనీ కనిపించలేదు. 'అల్‌కౌంటు' అంటే చాలా డబ్బు ఇస్తారు. 'డ్రాప్' అన్నవాళ్ళు ఆడరు. ఇంకా 'సీక్వెన్స్' అనీ 'ట్రిప్లెట్' అనీ రెండు మాటలు వింది. వాటి అర్థాలు తెలియలేదు. షో అన్నప్పుడుఆటఆఖరవుతుందని తెలిసింది. కాని 'కార్డుషో' అంటే ఏమిటో తెలియలేదు. ఇంకా 'ఎక్స్టెన్షన్' అన్నమాట కూడా వింది.

'తోమేశానమ్మగారూ! అంట్లు వెయ్యండి' అందిపనిమనిషిజానకివాటిని పరీక్షించి చూసింది. ఈమాటుఏ వంకా దొరకలేదు. నిజానికి ఇందాక కూడా మచ్చలు లేవు. అప్పుడు తనవళ్ళు ఉడికి పోతోంది.

జానకికి పని మనిషిమీద జాలి వేసింది. ఎవరిమీదో తెలియని కోపాన్ని నిష్కారణంగా దీనిమీద చూపిస్తోంది. తనకి నిజంగా ఎవరిమీద కోపమోనని చాలాసార్లు ఆలోచించుకుంది జానకి. ఆమెకేమీ సమాధానం దొరకలేదు.

బుజ్జిగాడు మళ్ళీవచ్చాడు. "సర్కస్ వచ్చిందిటమ్మా వెళ్ళనా" అని అడిగాడు. "నాన్నగారిని అడిగి వెడుదువు



గానిలే" అందిజానకి మృదువుగా. బాబు ధైర్యంగా ఈ మధ్యనే అమ్మనిఏదైనా అడగగలుగుతున్నాడు. ఇదివరకు జానకి ఏకారణం లేకుండానే వాడిని కొట్టేది. "నీళ్ళుపోసుకోనా అమ్మా"అన్నప్పుడు, "స్కూలుకి టైమవుతోంది అన్నం పెట్టమ్మా"అన్నప్పుడు కూడావిసుక్కునేది. తనకి బాబు మీద ఏమీ కోపం లేదని తెలుసుకున్నాక ఇప్పుడు వాడి మీద చిరాకు పడటం మానేసింది.

వాడు ముందు గదిలోకి వెళ్ళబోతోంటే చెయ్యి పుచ్చుకుని ఆపింది

జానకి. 'ఇప్పుడు కాదు. వాళ్ళ ఆట అయిపోయాక అడుగు' అంది.

'కాసేపు పుస్తకం తీసి చదువుకో. అప్పుడు పంపిస్తారు. లేకపోతే చదవటం లేదని తిడతారు' అంది. వాడు సరేనని చదువుకోవటం మొదలు పెట్టాడు. మంచంమీద అలాగేకూర్చుని ఉండిపోయింది జానకి. మళ్ళీలేచి చేతికి దొరికిన దారపుఉండ చిక్కు తీసింది.

పనిమనిషి అంట్లు తోమేసినట్లుంది. అన్నీ అక్కడ పెట్టింది. 'పని అయిపోయిందండమ్మగారూ' అంది.

"అయిపోయింది" అంది జానకి. పనిమనిషి వెళ్ళలేదు.

"ఏమే? ఇంకా ఉన్నావు?"

"కాస్త చింతకాయ పచ్చడి ఉంటే పెట్టించండమ్మగారూ"

"ఏమే ఉన్నట్టుండి దాని మీద మనసు పోయిందేమిటీ" అంది జానకి కొంచెం కుతూహలాన్ని ప్రదర్శిస్తూ.

"నాక్కాదు. ఆడికండి" అంది పనిమనిషి సిగ్గుపడుతూ.

"వాడెవడు?" అంది జానకి తెలిసీ కూడా.

"ఆడే, మావోడండీ" అంది సుబ్బి సిగ్గుతో కలిసిన చిరునవ్వుతో.

అదీ వాడూ చాలా కులాసాగా తిరుగుతారని జానకికి తెలుసు. ఆ వివరాలు తెలుసుకోవాలని చాలా కుతూహల పడేది. మొదట్లో "కాస్త పచ్చడి మిగిలింది. తీసికెళ్ళు" అని దాన్ని మాటల్లోకి దించి వివరాలడిగేది.దానిఆనందం పంచుకునేవాళ్ళు దొరికేసరికి అది అన్ని వివరాలతోనహా చెప్పేది.మంచి నీళ్ళు తెమ్మని చెయ్యిపుచ్చుకుంటాడనీ, సాయంత్రం పూట "ఇవాళ పనిమానెయ్యి. సరదాగా తిరుగుదాం" అంటాడనీ, తను పనికి బయలుదేరే సైముకి తలుపులు మూసేసి నవ్వుతూ పోజు కొడుతూ కూర్చుంటాడనీ, తను అంటిస్తేతప్ప బీడీ తాగడనీ.... ఇలా చాలా వివరాలు చెప్పేది. జానకికి వినడానికి చాలా కుతూహలం ఉండేది. కాని పనిమనిషి దగ్గర లోకువయిపోకుండా "సర్లేవే. ఇప్పుడివన్నీ నిన్నెవడు చెప్పమన్నాడు. ఆ పచ్చడి తీసుకుపో" అనేది. వినాలని జానకికీ, చెప్పాలని సుబ్బికీ విపరీతమైన ఉత్సాహం ఉండేది. మధ్యలో సంభాషణ ఆగిపోవటం ఇద్దరికీ బాధాకరంగా ఉండేది.

కొన్నాళ్ళు జానకే సుబ్బిని మాటల్లోకి దించేది. కొన్నాళ్ళుఅదే కల్పించుకుని చెప్పేది. జానకి తనకిష్టంలేనట్లు మొహం పెట్టివినేది. కొన్నాళ్ళు లోకువయిపోతానేమోనన్న భయంతో సంభాషణ తుంచేసేది. కొన్నాళ్ళు నిజంగానే కోపంవచ్చి తిట్టేది. ఎందుకో తెలియని కోపం అది. మనసులో తొక్కిపెట్టబడిన వికారం ఏదో బయటికి వచ్చి ఆమెని ఆవరించేది. పనిమనిషిమీద కోపంతో చిందులు తొక్కేది అప్పుడు. దాన్నితిట్టి పంపేశాక నిస్సహాయంగా మంచంమీద వాలి కళ్ళు తుడుచుకునేది.

ఇవాళకూడా జానకి తనంతట తను

అడగటం లేదు. దానంతట అదే చెప్పే టట్లు సంభాషణ సాగిస్తోంది. దానికీ ఉత్సాహం ఆగటం లేదు.అడగకుండానే చెప్పాలని చూస్తోంది.

'ఎంతసిగ్గే నీకు, వాడిపేరెత్తితేను' అంది జానకి.

'ఆనూ అలాగే అంటాడండి. ఎందుకే అంత సిగ్గూఅని. నాకుమాత్రం ఆడిని చూస్తేనే చచ్చే సిగ్గండి.' అంది.

'అంత సిగ్గయితే వాడితో ఎలా మాట్లాడతావే? ఇదెక్కడ చోద్యం! వాడి దగ్గిరకే వెళ్ళవా ఏమిటి?' అంది జానకి.

కొంచెం సిగ్గుతో 'దగ్గరకెడితే బుగ్గ గిల్లుతాడండి' అంది సుబ్బి.

జానకి ఒళ్లు ఝల్లుమంది.

వెంటనే హఠాత్తుగా దాని మీద కోపం వచ్చింది. 'బావుందే మీ వరసలూ మీరూనూ. ఇదిగో పచ్చడి పట్టి కెళ్ళు' అంది విసురుగా. పని మనిషి చిన్నబుచ్చుకుని వెళ్ళిపోయింది. ఎందుకో పనిమనిషి అక్కడ ఉండటం జానకికి ఏమాత్రం నచ్చలేదు. దాని ఉనికినే సహించలేక పోయింది.

అప్రయత్నంగా ఒక ఊహ మనసులో మెదిలింది. అది వాడికి చింతకాయ పచ్చడి పెడుతుంటే ఏం జరుగుతుందా అని. ఒక రకం సంఘటన ఊహలోకి వచ్చింది. నిజానికి అది ఆమె ఊహలోనిది కాదు. ఆమెకిప్పుడు ఊహించే శక్తిగాని, ఆలోచించే శక్తిగాని లేవు. ఒక ప్రేక్షకురాలిగా ఏం జరిగితే అది చూడగలదు. మంచిగానీ, చెడుగానీ తలవంచ గలదు. ఇంతకీ ఆ సంఘటన ఇదివరలో సుబ్బి ఆమెకి చెప్పినదే.

"నాకేసి అలా చూస్తావేం? మంచి నీళ్ళు తాగు" అందిట అది, చెంబు పట్టుకుని తనకేసేచూస్తున్న మగడితో.

"మంచి నీళ్ళు ఎక్కటంలేదు. నీ నీ అందాన్ని తాగుదామని ఉంది" అన్నాట్టవాడు. వెధవ! వాడికి అంత లేసి మాటలెలా వచ్చాయో?

జానకి గుండెల్లో ఏదో చిన్నపోటు ప్రారంభమయింది. ఉన్నట్టుండి కళ్ళలోకి నీళ్లు వచ్చాయి. నిస్సహాయంగా మంచంమీదవాలి వెక్కి-వెక్కి-ఏడిచింది.

* * *

మధ్యాన్నం మళ్ళీ పనిమనిషి వచ్చింది. అప్పుడు టిఫిను చేస్తోంది జానకి. ఇది ఆమె నిత్యకృత్యాలలో ఒకటి. పేకాట ఆదేగది శుభ్రంగా

---

* "అదేమిటోయ్, నీ జుట్టంతా అలా వూడిపోయింది?"

"ఆందోళనవల్ల."

"ఎందుకాందోళన?"

"జుట్టూడిపోతోందని."

ఊదవటం, సిగరెట్లు తెప్పించటం, రోజుకి రెండు సార్లు కాఫీ టిఫిన్లుచేసి అందించటం.

నాలుగు ప్లేటల్లో టిఫిన్లు పెట్టి, వాటిని గుమ్మం దగ్గర టేబులుమీద పెట్టి భర్తని పిలిచింది. అతను వచ్చి టిఫిన్లు పట్టికెళ్ళాడు. తర్వాత రెండు గ్లాసులు, మరచెంబు నిండా నీళ్ళు ఇచ్చింది. కాఫీకూడా కలిపింది. తర్వాత ఎంగిలి కంచాలు పని మనిషికి వెయ్యడానికి పెరట్లోకి వెళ్ళింది జానకి.

'పచ్చడి చాలా బావుందన్నాడమ్మా ఆడు' అంది పనిమనిషి.

జానకి ముఖం వికసించింది. 'ఇంకా ఏమన్నాడే' అని అడగాలని ఉన్నా అడగలేదు. అదే చెప్పింది. 'మీ చేతో చేస్తే అమృతం లాగుంటా యన్నాడండి' అంది.

జానకి ఏదో తోచి పేకాటగది దగ్గరగా వెళ్ళి తలుపు చాటున నుంచుంది. అంతా కజ్జికాయలు తింటూ ఆడుకుంటున్నారు. ఆయన ముక్కలు కింద పడేస్తూ 'ఎందుకొచ్చిన ఆట ఇది' కలుపులోనే రెండు ట్రిప్లెట్లు, ఒక సీక్వెన్సు పడ్డాయి. నీకు షో అయే సరికి నాకు ఆట బతకనుకూడా లేదు. ఇదిగో అకౌంటు' అంటూ డబ్బుతోశాడు.

'ఆడుకోవటంలో ఉంటుంది. సెట్లు మారుస్తో ఉండాలి. నీకు ఆ రీన్ రాణీ కావాలని నాకు తెలుసు. అందుకే తొక్కిపట్టాను చివరిదాకా' అంటున్నారు ఇంకొకాయన.

'నాకు కార్డుషో కాసలో మిస్సయ్యాను. నువ్వు స్పేడ్స్ త్రీ వేసిఉంటే నాకుషోయే....ఆహా! కజ్జికాయలు మజాగా ఉన్నాయిలే' అంటున్నారెవరో. జానకి చెవులు రిక్కించుకుని వింది. భర్త కాదు. గొంతు వేరుగా ఉంది.

"ఏదో ఉన్నాయి" అంటున్నారాయన చప్పరించేసి. కాసేపాగి "వాళ్ళకేముంది. ఇంట్లోనే ఉంటారుగా. తీరిగ్గా కూర్చుని చేస్తారు. అయినా సంవత్సరాల తరబడీ చేస్తున్నారుగా. ఈమాత్రం రాదా" అన్నాడు క్షమాపణ చెప్పుకుంటున్నట్లు. జానకి లోపలికి వెళ్ళిపోయింది.

వాళ్ళు రాత్రి తొమ్మిదింటికి లేచారు. "తొందరగా అన్నంపెట్టు. సినిమాకి పోవాలి" అన్నాడు అతను. అన్నంపెట్టి పంపేసింది.

ఆ రాత్రి జానకికి నిద్రపట్టలేదు. అలాగని పెద్దగా ఆలోచనలు లేవు ఆమెకి. అసలు జానకికి ఆలోచనలు రావటం మానేసి చాలా కాలంఅయింది. రోజులు గడిచిపోతే చాలునన్నట్లుంది. చెప్పినపనులు చెయ్యటం, ఏం జరుగు




తుందో చూడటం—ఇంతేఆమెకితెలిసినది. అయితే పక్కింటి మొగుడూ పెళ్ళాలు కలిసి సరదాగా సినిమాకి వెళ్ళినప్పుడూ, తలుపులు వెయ్యకుండానే ఆయన పెళ్ళాన్ని ముద్దుపెట్టుకున్నప్పుడు, బాబాయి పిన్నికి కొత్తచీర కొనిచ్చి అప్పుడే కట్టుకోవాలని బలవంత పెట్టినప్పుడు, చెల్లితో మరిది "నీకళ్ళల్లో ఏదో అందం ఉంది. అందరూ వేరు నువ్వు వేరు" అన్నప్పుడు, సుబ్బి పుట్టిన రోజున దాని మొగుడు యజమానిని ప్రతిమాలి మరీ సెలవడిగి పుచ్చుకున్నాడని తెలిసినప్పుడు, ఆయన గారి స్నేహితుడి వివాహ వార్షికోత్సవానికి తనకీ భర్తకీ ఆహ్వానం వచ్చినప్పుడు జానకిలో ఏదో సంచలనం, ఏదో చైతన్యం కలిగేవి. తనకి కావలసిన దేదో ఉందనిపించేది. తనకి అసౌఖ్యంగా వుందని తెలిసేది. ఒక రకమైన బాధ. ఏమిటో తెలిసేది కాదు. గుండెల్లోపోటు. నరాల నీరసం, ఒంట్లో నిస్సత్తువ.

వివాహిత కాకపూర్వం, అయిన కొత్తలోనూ జానకి చలాకీ పిల్ల అని, ముగ్ధమోహన రూప అనీ ఆమె మనస్సు బంగారు కలలతో నిండిఉండే దనీ అంటే ఇప్పు డెవరూ నమ్మరు.

వానలేక ఎండిపోయిన చెట్లని చూస్తే వాటికీ తనకీ భేదం లేదనిపించేది ఆమెకి.

అయితే అతను దేనిలోనూ లోటు చేసేవాడుకాదు ఆమెకి. ప్రతీ పండగకీ కొత్తచీర కొనుక్కోమని డబ్బు ఇచ్చేవాడు. ప్రతివారం పక్కింటావిడతో



సినిమాకి వెళ్లమనేవాడు. ఆమెకి వంట్లో జ్వరంగా ఉన్నరోజున కేరియర్ తెప్పించేవాడు. కుర్రాడికి చదువు చెప్ప డానికి ట్యూషన్ మాస్టర్ని పెట్టాడు. బజారు సరుకులు తేవడానికి జవాను ఉన్నాడు. తను నిర్వహించవలసిన బాధ్యతలు అతని కింకేవీ కనిపించ లేదు. నిశ్చింతగా పేకాటలో కూర్చునే వాడు. పేకాటకి అంతరాయం కలిగితే తప్ప ఇంక దేనికీ భార్యమీద విసుక్కునే వాడు కాడు. పిల్లవాడి మీదచెయ్యివేసి, చంటిదాన్ని కడుపులో దూర్చుకుని అలాగే నిద్రపోయింది జానకి.

*         *         *

మర్నాడు సుబ్బి ఆలస్యంగా వచ్చింది. దాని బుగ్గమీద గాట్లుపరీక్షగా చూసింది జానకి. అంతే, ఏమీమాట్లాడ లేదు. విసుగ్గా అంట్లు వేసింది. అనుకో కుండా కోపం వచ్చింది ఆమెకి.

సుబ్బి చాలా ఉత్సాహంగా ఉంది. దానికి రాత్రి మధుర ఘట్టాలు గుర్తుకు వచ్చి మనస్సు ఉరకలు వేస్తోంది. రాత్రి జరిగినవన్నీ జానికమ్మగారికి చెప్పి ఆనందం పంచుకోవాలని సుబ్బి ఉబ లాటం. అమ్మగారు సుముఖంగా ఉన్నట్టులేదు. అయినా ఎలాగైనా సందర్భం కల్పించుకునిచెప్పెయ్యాలను కుంది. ముసిముసి నవ్వులు వద్దన్నా బయటికి వచ్చేస్తున్నాయి.

'ఏమిటే ఆ నవ్వులు. పనిచేసేదాని తరహాయేనా అది ! అంట్లు తోము తీసి కెళ్ళి' అని కసిరింది జానకి.

సుబ్బి మొహంలో నవ్వు మాయ మైంది. మనస్సు కష్టపెట్టుకుంది. మాట్లాడకుండా అంట్లు తీసుకుని వెళ్ళి పోయింది. అవి అయిపోయాక ఇల్లు ఊడ్చింది. జానకి అంతసేపూ కోపం గానే ఉంది. సాయంత్రం చెప్పొచ్చులే అని పని చూసుకుని వెళ్ళిపోయింది.

"నా కివాళ తొమ్మిదింటికే బడి. తొందరగా అన్నం వండాలి" అన్నాడు బాబు. వంట పనిలో మునిగిపోయింది జానకి. ఆయనింకా లేవలేదు. రాత్రి రెండింటికో మూడింటికో వచ్చినట్లు న్నారు. కాఫీకాచి ఫ్లాస్కులో పోసింది. ఈ పూటకి ఏం చెయ్యాలో కనుక్కో వాలి. గుమ్మంలోనే కూర్చుంది అతను లేచేదాకా నిరీక్షిస్తూ.

అతను తొమ్మిదింటికి కూడా లేవ లేదు. ఆఫీసుకి ఆలస్యం అవుతుందని తనకి తోచినదేదో చేసేసింది. అతను లేచి తినేసి వెళ్ళిపోయాడు. ఇలా చేశావేం అనిగాని, ఉప్పెక్కువ అయింది అనిగాని అనడు. ఆమె వండి పెడుతుంది. అతను తినేసి వెళ్ళి పోతాడు.

సాయంత్రం పక్కింటావిడ వచ్చింది. "సినిమాకి వస్తారా" అంటూ.

"ఏమిటి విశేషం ?"

"ఏంలేదు. మా పాప సినిమాకి తీసికెళ్ళమని పోరుతోంది. నా కొక్కర్తికీ అక్కడ తోచదు. మా వారికి వీల్లేదట" అందావిడ.

జానకి మాట్లాడలేదు.

"మీ ఆయన పర్మిషన్ కావాలా ?"

"అందుకోసం కాదనుకోండి గానీ...."

"పోనీ, నేనడుగుతాను అన్నగారిని...."

"మీరా" అంది జానకి.

ఇంతలోనే అతని పిలుపు వినబడింది.

"ఏమిటంటుంది ఆవిడ ?"


"సినిమాకి రమ్మంటుంది."

"వెళ్ళు. జేబులో అయిదు నోటుంది. తీసుకెళ్ళు"

జానకికి వెళ్ళాలని లేదు. అమాటే చెప్పింది. 'నీ యిష్టం' అనివూరుకున్నాడతను. కడుపులో నెప్పిగా ఉందని చెప్పి మానేసింది.

ఆ మర్నాడుకూడా సుబ్బి ఉత్సాహంగా వచ్చింది. కాని అమ్మగారు ఇవాళకూడా వినే పరిస్థితిలో లేదు. ఎంత ప్రయత్నించినా కుదర లేదు. అప్పటికీ "తొందరగా గిన్నెలు వెయ్యండి. ఆ డీపాటికి వచ్చేసి ఉంటాడు" అందికూడా. అమ్మగారు కోపంతో చిటపట లాడుతోంది.

మర్నాడు అరగంట ఆలస్యం అయ్యేసరికి పట్టుకు దులిపేసింది. నీకు బుద్ధీ జ్ఞానంలేదా ? మేముఅన్నం వండుకోవాలని తెలీదా? అంటూ. అంత కోపం దేనికో సుబ్బికి అర్థం కాలేదు. తలొంచుకుని పని చూసుకుని వెళ్ళిపోయింది. వెళ్ళిపోయేటప్పుడు ఆఖరి ప్రయత్నంగా "కొంచెం ఆవకాయ ముక్క పెట్టించండి" అంది. "ఇప్పుడు



చెయ్యి ఖాళీగా లేదు!" అంటూ పంపిం చేసింది జానకి.

మర్నాడు పొద్దున్న సుబ్బి రాలేదు. సాయంత్రం ఆలస్యంగా వచ్చింది. "తిరపతి కొండకి వెళ్ళామండి" అని ఏదో చెప్పబోయింది. జానకి విసుక్కుంది.

మర్నాడు సుబ్బిని పనిలోనుంచి మానిపించేసింది జానకి. మానిపించడానికి కారణం ఏదీ చెప్పలేదు. ఇలా నాగాలుపెడితే లాభంలేదని దెబ్బలాడింది. రావలసినది సరిగ్గా లెక్కకట్టి ఇచ్చి పంపించేసింది. తనకింకో ఇంట్లో పని లేదన్నా వినలేదు. సాయంత్రం అంట్లూ, చెంబులు, ఇంటి పనులు అన్నీ తనే చూసుకుంది. కొంత అలసట కలిగినా అంత బాధనిపించలేదు. కొత్త పనిదాన్ని పెట్టుకోలేదు.

ఆ రోజు పేకాట మున్మరంగా సాగింది. దాదాపు రోజల్లా ఆడారు. ఆ రోజున రెండు సార్లు వేడి టిఫిన్లు చేసి ఇచ్చింది. మూడోసారికి గిన్నెలో మూతపెట్టి ఇచ్చింది. ఇంకో ఫ్లాస్కు తెప్పించి రెండింటి నిండా కాఫీ పోయించుకున్నాడు అతను. తెల్లారి అయిదయ్యేదాకా ఆడారు.

మర్నాడు ఆదివారమైనా ఎవరూ రాలేదు అతను ఆ రోజంతా కాళీగానే ఉన్నాడు. ఏమీతోచక అటూ ఇటూ కాలుగాలిన పిల్లిలా తిరిగాడు రోజంతా.

మర్నాడుకూడా పేకాటజట్టురాలేదు. తొమ్మిదింటిదాకా పేపర్లో అడ్డమైన చెత్తా చదివి అప్పుడు వచ్చి గుమ్మం మీద కూర్చున్నాడు. వంట అయిందా అని అడిగాడు. అయింది అందామె పీట వెయ్యడానికి లేస్తూ.

'ఇంకా స్నానం చెయ్యలేదు' అన్నాడతను.

"నీళ్ళు తీసుకు వస్తాను" అంటూ దొడ్లోకి వెళ్ళింది. పెద్ద బిందెనిండా తోడింది. గట్టుమీద పెట్టడానికి ఎత్తింది. కాని కష్టం అయింది. బిందె చాలా బరువుగా ఉంది. కొంగు నడుముకి చుట్టుకుని నెమ్మదిగా ఈడ్చింది.

"ఎందుకంత బరువు మోస్తావు? నేను వస్తున్నాను ఆగు" అంటూ అతను వచ్చాడు. 'ఫరవాలేదు. రోజూ పెడుతున్నాగా' అందామె.

అతను సాయం పట్టాడు. ఆమె వెనక చెయ్యి పట్టి ఒక చెయ్యి అతని

---

★ అప్పారావు : ఒక్క రూపాయివుంటే ఇద్దూ!"

సుబ్బారావు : "జేబులో దమ్మిడీలేదు."

అప్పారావు : "ఇంటిదగ్గిర?"

సుబ్బారావు : "అంతా కులాసా దేవుడి దయవల్ల."

భుజంమీదవేసి నడిచింది. కొత్తగా ఉంది ఆమెకి.

నీళ్ళు పోసుకుంటూ "తువ్వాలు పట్రా" అన్నాడు. ఉతికిన తువ్వాలు చెట్టు కొమ్మకి తగిలించింది.

అతను వొళ్ళు రుద్దుకున్నాడు. వీపు రుద్దుకోవటం కష్టం అయ్యింది. జానకి వైపు చూచాడు. "నేను రుద్దనా" అంది. అతను తలవూపాడు. సబ్బుతో రుద్దింది. అతను తువ్వాలుతో వళ్ళంతా తుడుచుకున్నాడు. ఈలోగా ఆమె చకచకా పీట, కంచం, మంచినీళ్ళు సిద్ధం చేసింది.

చాలాకాలం తర్వాత అతను ఇవాళ తీరిగ్గా పనులు చేస్తున్నాడు. తీరికగా స్నానం చేసిన తర్వాతఇప్పుడు తీరికగా భోజనం చేస్తున్నాడు. భోజనం చాలా బావున్నట్లనిపించిందతనికి మొదటి సారిగా. "ఇంకొంచెం కూరవెయ్యి" అన్నాడు. అది తిన్నాక మళ్ళీ కొంత వేయించు కున్నాడు. తర్వాత మజ్జిగ లోకి మరికొంత వేయించుకున్నాడు.

అతను భోజనంచేసి వెళ్ళిపోయాక వంటింటి పనిముగించుకుని ఆమెనడుం వాల్చింది. ఆమెకి నిద్రపట్టలేదు. పట్టా లని ప్రయత్నించలేదుకూడా. ఇవాళ రోజూలా లేను అనుకుంది. ఉత్సాహంగా చుట్టూ చూసింది.

ఇల్లంతా చిందర వందరగా ఉంది. ఆయన కూర్చునే టేబులు మీద పుస్తకాలు చిందరవందరగా ఉన్నాయి. లేచి టేబులు సర్దింది. ఇదివరకు కుడుతూ కుడుతూ మధ్యలో ఆపుచేసిన టేబులు క్లాత్ కుట్టడం పూర్తిచేసింది. అది వేశాక టేబులుకి మంచి కళ వచ్చింది.

సాయంత్రం ఆయన వస్తున్నారేమో నని చూసింది. ఆరింటికివచ్చా డతను. "టిఫినుచేసావా" అని అడిగాడు. పావు గంటలో వేసింది పెసరట్లు. ఇంకో రెండు వెయ్యమని అడిగి మరీతిన్నాడు. "అల్లంముక్కలు వేస్తే మంచి రుచి వచ్చింది" అన్నాడు.

బయటికి వెళ్ళిపోబోతూ టేబులు కేసి చూశాడు కొత్తగా కనిపించింది. "ఎప్పుడు అల్లావు ?" అని అడిగాడు. "ఇవాళే పూర్తిచేశాను" అంది. 'గుడ్' అని వెళ్ళిపోయాడు.

అతను తిరిగి వచ్చేసరికి ఎనిమి దయింది. ఈలోగా ఇల్లు చాలాభాగం సర్దింది. ఎనిమిదిన్నరకి ఇద్దరూ కలసి భోజనం చేశారు.

భోజనం చేశాక "కాసేపు వెన్నెల్లో కూర్చుందాం" అన్నాడు. ఎందుకో వెన్నెల్లో కూర్చోవాలనిపించింది. ఇల్లు పరిశుభ్రత కారణం కావచ్చు.

జానకి అతని వెనకాలే నడిచింది.

వాతావరణం మనోహరంగా ఉంది. అసలే అందంగా ఉన్న పరిసరాలు, వెన్నెలలో మరింత శోభిస్తున్నాయి. ప్రతి ఆకు, ప్రతితీగ, ప్రతి ఇసుక రేణువు మెరుస్తున్నట్లు ఉన్నాయి. గాలి సన్నగా వీస్తోంది.

ఇద్దరూ ఒకరిదగ్గరగా ఒకరు కూర్చు న్నారు. జానకి బొటనవేలితో నేలని రాస్తోంది. అతను జానకిని చూస్తు న్నాడు.

చాలాసేపు ఇద్దరూ మౌనంగా కూర్చున్నారు. తర్వాత "చాలాబాగుంది కదూ" అన్నాడు అతను. తలవూపింది జానకి. ఆమె వంట్లో విద్యుత్తు ప్రవహిస్తోంది. మనస్సు ఉరకలు వేస్తోంది.

"ఆ మల్లెపొదలూ, ఆ పచ్చటి ఆకులూ, ఆ వేపచెట్టూ, ఇవన్నీ వెన్నెల్లో అందంగా లేవూ" అన్నాడు విస్మయంతో అటుచూస్తూ.

జానకి కళ్ళు వెలుగుతున్నాయి. తలవూపి ఇంకా ఏమంటారో అని చూస్తోంది.

"రోజూ మనం వీటిని చూస్తూనే ఉన్నాం. వెన్నెల్లో ఇవింత అందంగా ఉంటాయని ఎప్పుడూ అనుకోలేదు." అన్నాడు.


"అవును" అంది జానకి మొదటి సారిగా మాట్లాడుతూ.

ఆ తర్వాత ఇద్దరూ కాసేపు మౌనంగా కూర్చున్నారు. అనిర్వచనీయమైన ఆనందం ఇద్దరి మనస్సులలోనూ వుంది. మాటలలో చెప్పలేని ఒక అనుభూతిని అనుభవిస్తున్నారు.

రాజారావు తదేకంగా జానకికేసి చూస్తున్నాడు. జానకి అప్పుడప్పుడు పైకిచూస్తూ తలదించుకుంటోంది.

అతని కళ్ళల్లో బాధ కనిపించింది. ఆమె కనుబొమలు ముడిచి పైకి చూసింది ఏమిటన్నట్లు.

"నువ్వు బాగా చిక్కిపోయావు" అన్నాడు అలాగే చూస్తూ. "నేనేం చిక్కాను?" అంది జానకి తలవంచుకుని. తర్వాత అతనికేసి "మీరుమాత్రం ఇదివరకటిలా ఉన్నారా?" అంది. "అవును" అన్నాడు రాజారావు ఏదో



ఆలోచిస్తూ. తిండీ, డబ్బు పుష్కలంగా ఉండి ఇద్దరూ ఇలా అయిపోవటానికి కారణాలు వెతుకున్నాడతను.

ఉన్నట్టుండి, చల్లటిగాలి వీచింది. "రండి. లోపలికి పోదాం. చలిగాలి మంచిది కాదు" అంది. ఇద్దరూ లేచి లోపలికి వెళ్ళారు.

"ఇవాళ అయిదు రూపాయలు లాభం" అన్నాడు రాజారావు.

"ఎలా వచ్చింది ?"

"ఆటలలో. పేకులు పెన్నిసు పందెం కాశాడు మా సత్యన్నారాయణ. నాకా ఆట వచ్చునని వాడికి తెలీదు. అయిదు రూపాయలు పందెం కాసి ఓడిపోయాడు."

"అది మీరు బాగా ఆడతారని బాబాయి చెప్పాడు" అంది జానకి.

అతను హృదయంనిండా గాలిపీల్చుకుని "ఎప్పుడు చెప్పాడు ?" అని అడిగాడు.

"చంటిది పుట్టినప్పుడు"

"అప్పుడు బాబాయి వచ్చాడా ? నే చూడలేదే"

"అప్పుడు మీరు...." అని ఏదో అనబోయి ఆగి....మీరు పనిమీదవెళ్ళినట్లున్నారు" అంది.

అతనికి గుర్తు వచ్చింది, తనా రోజున ఎక్కడికీ వెళ్ళలేదు. ఇంట్లో పేకాట ఆడుతున్నాడు. అతనిలో ఏదో బాధావీచిక హృదయ మంతటాపాకింది.

"అవునుగానీ నీకు వీణ వచ్చునని చెప్పావుకదూ ?"

"ఎప్పుడు చెప్పాను ?"

"పెళ్ళిచూపులరోజున.

ఇద్దరికీ ఆనాటి మధురస్మృతులు గుర్తుకు వచ్చాయి. జానకి దొంగతనంగా పైకి చూస్తున్నప్పుడు అతనూ అటే చూస్తున్నాడు. ఇద్దరి కళ్ళూ కలిసి దిగిపోయాయి.

జానకికీ, రాజారావుకీ కూడా వళ్ళు ఝల్లుమంది. మనసు ఉరకలువేస్తోంది. ఊహాలు పరవళ్ళు తొక్కుతున్నాయి.

"అప్పుడు నువ్వు దొంగతనంగా చూశావు కూడాను" అన్నాడు. ఆమె సిగ్గుతో తలదించేసుకుంది. "పోండి.... మీరు చూడందే నేను చూశానని ఎలా తెలిసింది ?" అంది.

"నేను నీలా దొంగతనంగా చూడలేదే. ధైర్యంగా నీకేసి చూశాను"

బయట పరచుకున్న వెన్నెల ఇద్దరి హృదయాలలోకీ పాకుతోంది. తియ్యటి కొత్త అనుభవం కలుగుతున్నట్లుగా ఒళ్ళు పులకరిస్తోంది.

ఆమె నడుంచుట్టూ చెయ్యివేశాడు అతను. ఇంతలో చంటిది లేచి ఏడుపు మొదలుపెట్టింది. దాన్ని ఊరుకోబెట్టడానికి జానకి లేచి లోపలికి వెళ్ళింది.

* * *

మర్నాడు ఆఫీసు పని చాలా ఉందని తొందరగా వంటచెయ్యమని, తిని వెళ్ళిపోయాడు. ఆ మధ్యాహ్నం కూడా ఆమెకి నిద్ర పట్టలేదు. అంతా కొత్తగా వుంది. ఇల్లు నందనవనం

లాగా, సంసారం ప్రేమయాత్రలాగా ఉంది. లేచి ఇల్లంతా పూర్తిగాసర్దింది. అన్నీ క్రమంలో అమర్చింది. అతని పేబులు గురించి ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుంది

అయిదింటికిగాని ఆఫీసు వదలరని, ఆరింటికిగాని ఆయన రావటం పడదని తెలిసినా, మూడింటినించీ ఎదురు చూసింది. అతను ఆరింటికి వచ్చాడు, వస్తూనే "తొందరగా తయారవు. సినిమాకి వెడదాం" అన్నాడు.

"ఇప్పుడేం సినిమా ?"

"ఏం"

"ఇంకా వంట పూర్తికాలేదు"

"ఏం వండావు ?"

"అన్నం ఒకటే"

"చాలు.ఆవకాయ వేసుకుతిందాంలే. అన్నాడు.

ఆమె కట్టుకున్న బట్టలు చూసే టప్పటకి అతనికి మనస్సు చివుక్కుమంది. "నీకు మంచి చీరలు లేవూ" అన్నాడు. జానకి తలదించుకుంది. "ప్రతీ పండగకీ ముప్ఫై రూపాయలు ఇచ్చాగదా చీర కొనుక్కోమని" అన్నాడు. "కొనుక్కోలేదు. ఆ డబ్బు ఇంట్లోనేఉంది! అంది "అదిలా పట్రా. ముందు షాపుకి వెడదాం" అన్నాడు. ఆమె తలవూపి లోపలకి వెళ్ళింది.

---

★ వెనకటి కొక రాజుగారి దగ్గిర ఒక విదూషకుడుండేవాడు. అతడు సామెతల పుట్ట. మాట మాట్టాడితే సామెత చెప్పేవాడు. ఆ అంటే సామెత. ఊ అంటేసామెత. రాజుగారు బోరెత్తి హోరెత్తిపోయాడు. సామెతలు మానమని ఎన్నోసార్లు ఆజ్ఞాపించాడు. విదూషకుడు మానలేదు. ఈసారి సామెత చెబితే ఉరితీస్తానన్నాడు. అయినా వాడు మానలేదు. చివరికి విసుగుపుట్టి రాజు వాణ్ణి ఉరి తీయమని ఆజ్ఞాపించాడు.

విదూషకుడిని రాజభటులు వధ్య స్థానానికి తీసుకుపోయారు.

ఉరితాడు మెడకు తగిలించారు. ఇంతలో రాజుగారికి మక్కీ జాలి కలిగింది. "పాపం పిచ్చివాడు; అలవాటైపోయి అలా సామెతలుచెబుతూ వుంటాడు." అనుకుని ఒక భటుడిచేత కబురు పంపించాడు — "ఇక నుంచి సామెతలు మానివేసే టట్టయితే క్షమిస్తా" నని, భటుడు ఉరుకులు పరుగుల మీద వచ్చి రాజ శాసనం వినిపించాడు. విదూషకుడిని రాజుగారు క్షమించారు గదా అని, ఉరికంబంనుంచి కిందికి దించి, రాజ భటులు అడిగారు: "ఇకనుంచి సామెతలు మానేస్తావా ?"

విదూషకుడు : "ఇక ఛస్తే సామెతలు చెప్పను. ఊరుకున్నంత ఉత్తమం, బోడిగుండంత సుఖం లేదన్నారు." రాజ భటులు వాణ్ణి వెంటనే ఉరితీశారు.

నిద్రలోంచి లేచినట్లుగాఉంది అతనికి. చాలా విషయాలు కొత్తగా అర్థం చేసుకుంటున్నాడు. ఆమెకి సంబంధించిన విషయాలలో తనకెంత ప్రాముఖ్యం ఉందో అతని కర్థమవుతోంది.

షాపుకివెళ్ళి మూడు చీరలూ, మూడు జాకెట్టు గుడ్డలు తీసుకున్నారు. పిల్లలకి బట్టలు కూడా తీసుకున్నాడు. ఆమె సంతోషంగా కట్టుకుంది. సినిమాకి మర్నాడువెడదామని నిర్ణయించుకున్నారు.

ఆమె ఒక్కర్తే ఇంటిపనులు చేసుకుంటోందని మర్నాడు గమనించాడు అతను. ఆ విషయం అడిగితే "పనిమనిషిని మానిపించేశాను" అంది జానకి. "సరే కాఫీ కాచు" అన్నాడు.

కాఫీ కాచేలోగా అతను చాలా ఆలోచించాడు. డబ్బిస్తే చీరలు కొనుక్కోని జానకి తను కొంటే ఎందుకంతసంతోషంగా ఒప్పుకుందో, మామూలు చీరలయినా ఎందుకంత సంతోషంగా కట్టుకుందో, ధనార్జనతో నిమిత్తం లేకపోయినా ఈ మూడు రోజులూ ఎందుకంత బావున్నాయో, ఈ రెండు రోజుల్లో జానకి కళ్ళల్లో ఎందుకంత భక్తి, ప్రేమ, కృతజ్ఞత, ఆప్యాయత కనిపిస్తున్నాయో తన వంట్లో ఉత్సాహం ఎందుకంత ఉరకలు వేస్తోందో, ఈ జీవితం పోగొట్టుకోకూడదని ఎందుకనిపిస్తోందో - ఇవన్నీ ఆలోచించాడు. తను ఇచ్చేదేమిటో, పుచ్చుకునేదేమిటో స్పష్టంగా తెలిసినట్లయింది.

జానకి ఉత్సాహంగా నవ్వుతూ కాఫీ అందించింది.

"ఏమిటంత ఉత్సాహం" అన్నాడతను.

"ఏమీలేదు. కాఫీ తీసుకోండి"

అతను కాఫీ అందుకోలేదు. చెయ్యి అందుకున్నాడు.

"ఏం పనిఅది" అంది చెయ్యి లాక్కుంటూ,

"ఏం, రేపు సినిమాకి తయారేనా"

"ఊహూ" అంది జానకి నవ్వి.

* * *

మర్నాడు పధ్నాలుగోతేదీ. సీతాపతి ఊరునుంచి తిరిగి వచ్చేరోజు. ఆ మాట గుర్తుకు రాగానే ఒక్కసారి నీరసం వచ్చినట్లయింది రాజారావుకి. ఉత్సాహం చప్పగా చల్లారిపోయింది. వంట్లో చైతన్యం తగ్గిపోయింది. కళ్ళల్లో వెలుగు మాయమయింది. కాసేపు మంచంమీద అలాగే కూర్చుండిపోయాడు. తర్వాత లేచి కోపంగా గదిలోకి వెళ్ళి శత్రువుని చెండాడినట్లు పేకముక్కల్ని చింపేసి విరజిమ్మాడు. ఆ గదికి తాళంపెట్టి బయటికి వచ్చేశాడు. కానీ వాళ్ళు రేపు వచ్చినప్పుడు ఏం చెప్పాలో తెలియలేదు. ఏదో నిస్సహాయత, ఎవరిమీదో తెలియని కోపం అతన్ని ఆవరించాయి.

ఆ రాత్రి అతనికి జ్వరం వచ్చింది. జానకి చాలా కంగారుపడింది. రాత్రంతా నిద్ర మానేసి అతని దగ్గరే కూర్చుంది.



తర్వాత

జానకి పక్కకి తిరిగి కళ్ళు తుడుచుకుంటుంటే 'ఛ. ఏడవకు. జ్వరం తగ్గకేం జేస్తుంది' అన్నాడు. జానకికి మాత్రం భయంగానే వుంది.

అతను ఒకందుకు మాత్రం సంతోషించాడు. పేకాటకి రానందానికి చక్కటి కారణం దొరికింది. సీతాపతి, రాజు వచ్చినా ధైర్యంగా ఎదుర్కొ‌గలడు.

వాళ్ళిద్దరూ సాయంత్రం వచ్చారు. విషయం తెలుసుకుని పరామర్శించి వెళ్ళిపోయారు. మర్నాడు కూడా వచ్చారు. ఆ తర్వాత రాలేదు. ఇక పేకాట ఆడదలచుకోలేదని చెప్పేశాడు.

నాలుగు లంకణాలు చేసిన తర్వాత జ్వరం తగ్గుముఖం పట్టింది. నార్మల్‌కి వచ్చేసరికి మరో రెండురోజులు పట్టింది. పథ్యం తిన్నాక మూడు రోజులకి మామూలు మనిషి అయ్యాడు.

జానకి కళ్ళల్లో నిండుగా తృప్తి కనిపిస్తూంది. మొహం పీక్కుపోయినా, మనిషి చిక్కిపోయినా ఏదో సంతోషం మొహంలో కనిపిస్తూంది.

ఈ పదిరోజుల్లోనూ హాయిలో బాధ, బాధలో హాయి అనుభవించారు ఇద్దరూ. తనకోసం, తనపక్క, తనతో కూర్చున్న జానకికోసం ప్రాణంకూడా ఒడ్డగలడు అతను. తనకోసం, తన పక్క, తనతో ఉన్న అతని కోసం సర్వమూ అర్పించగలదు ఆమె.

☆ ★ ★

ఆరోజు అతను అడిగి మరీ ఆమె చేత వీణ పాట పాడించుకున్నాడు.

సాయంత్రం అయేసరికి సినిమాకి బయలుదేరారు. చిన్నాడినీ, చంటిదాన్నీ వాళ్ళ నాయనమ్మ తీసికెళ్ళింది.

హాలు దగ్గరే కాబట్టి నడిచే బయలుదేరారు. బయట మబ్బులు పట్టాయి.

మూడు నెలలు తీక్షణంగా ఎండ కాసిన తర్వాత మొదటిసారిగా వర్షం పడింది. పన్నీటి జల్లులా ఉంది వారి ప్రాణానికి.


"ఈ వర్షంలో తడవాలని ఉంది" అంది జానకి.

"బలేదానివే. ఇలా రా" అన్నాడతను.

అతను ఒక కొట్టు మెట్ల మీద నుంచుని రిక్షా కోసం చూస్తున్నాడు. ఆమె అతని పక్కనే నుంచుని వర్షంలోకి చేతులు పెడుతోంది."

"ఏం పనులవి? చిన్న పిల్లలలాగా" అన్నాడతను నవ్వుతూ. "నేను చిన్నపిల్లనే. మీరూ చిన్నపిల్లాళ్ళే" అంది జానకి.

తన వయస్సు ముప్పై దాటలేదని




అతనికి తెలుసు. జానకి వయసుకూడా ఇరవై అయిదు దాటలేదని తెలుసు. ఇద్దరూ చిన్నపిల్లాళ్ళే. అతనూ వర్షంలోకి చేతులు పెట్టాడు.

జానకి పక్కకి చూస్తే మొగుడితో వానలో తడుస్తూ పోతున్న సుబ్బి కనిపించింది. దాన్ని పిలిచి "రేపటినించీ పనిలో జేరు. ఇంకో రూపాయి ఎక్కువ ఇస్తాలే" అంది. "అలాగేనమ్మా" అంది అది కృతజ్ఞతగా చూస్తూ. దాని మొగుడు కూడా జానకికి దణ్ణం పెట్టాడు. తర్వాత సంతోషంగా వెళ్ళిపోయారు.

రిక్షా వచ్చింది. జానకీ, రాజారావు ఇద్దరూ అందులో కూర్చున్నారు. "వెంకటేశ్వరా టాకీసుకి పోనీ" అన్నాడతడు.

బయట హోరున వర్షం పడుతోంది.

"చలేస్తోంది" అన్నాడతను.

"మరేపాపం" అంది జానకి.

"పాపం కాదు పుణ్యమే! పురుషార్థం కూడాను" అంటూ దగ్గరికి తీసుకున్నాడు. ఆమె అతనికి మరింత దగ్గిరగా జరిగి అతుక్కుపోయింది.

రిక్షా పరవళ్ళు తొక్కుతూ ముందుకు సాగింది.

***